సాక్షి
విజయనగరం
బుధవారం, 25, అక్టోబర్, 2023



ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ప్రజారోగ్యానికి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. పౌష్టికాహార లోపాన్ని నిరోధించేందుకు ఫోర్టిఫైడ్ రైస్‌ను సరఫరా చేస్తోంది. - 8లో



ఫైనల్స్‌కు ముంబై, మహారాష్ట్ర

ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వేదికగా జరుగుతున్న అండర్-19 అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ టోర్నీలో ముంబై, మహారాష్ట్ర జట్లు ఫైనల్స్‌కు చేరాయి. - 8లో



సిరులు కురిపిస్తున్న పూలు

పూలు సాగు చేసే రైతులు నాలుగు రాళ్లు వెనుకేసుకుంటున్నారు. అన్ని రకాల పూలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో పూలసాగు సిరులు కురిపిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

గగన్‌యాన్ ప్రాజెక్టులో గజపతినగరం యువకుడు



జగదీష్

గజపతినగరం: ఇస్రో ఇటీవల చేపట్టిన గగన్‌యాన్ తొలిమానవ రహిత మిషన్‌లో గజపతినగరానికి చెందిన కొర్రాయి జగదీష్ పాలుపంచుకున్నారు. రెండేళ్లుగా ఇస్రోలో శాస్త్రవేత్తగా ఆయన పనిచేస్తున్నారు. గగన్‌యాన్ మిషన్‌లో పాల్గొన్న జగదీష్‌ను స్థానికులు అభినందించారు. మద్రాస్ ఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన జగదీష్ తండ్రి హరిబాబు వీఆర్వోకాగా, తల్లి అప్పికొండ సత్యవతి సాలూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆయుధ పూజ



దసరా ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు, పోలీస్ వాహనాలకు ఎస్పీ ఎం.దీపిక, పోలీస్ అధికారులు, సిబ్బంది మంగళవారం ప్రత్యేకపూజలు జరిపారు. ఆర్మ్‌డ్ రిజర్వు ఆయుధాగారం, మోటారు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్‌లో దుర్గామాతను దర్శించుకున్నారు. జిల్లా ప్రజలందరిపైనా దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ విభాగాలకు అన్ని విధాలుగా శుభాలు జరగాలని ఆయుధపూజ చేసి, వేద పండితులు ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం



బాధితులకు చెక్కును అందజేస్తున్న రాజశేఖరం, విక్రాంత్

రేగిడి: మండలంలోని పెదశిర్లాం గ్రామానికి చెందిన కురిగాన లక్ష్మి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షలను చెక్కు రూపంలో ఆమె భర్త ఆదినారాయణకు మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ, శాసమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్‌లు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి లెంక రాంబాబు, గ్రామ పెద్దలు పాలవలస జగదీష్, పోరాపు బుచ్చింనాయుడు, లెంక దామోదరావు, పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల పరిశీలకుడిగా వేణుగోపాల్



విజయనగరం: గోవాలో ఈ నెల 26 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు జరగబోయే 37వ జాతీయ క్రీడలకు జిల్లాకు చెందిన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావును డిప్యూటీ చీఫ్ కమిషనర్‌గా ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ నియమించింది. ఈ పదవికి మొట్ట మెదటిసారిగా విజయనగరం జిల్లా నుంచి ఎంపిక చేసినందుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, క్రీడా సంఘాల ప్రతినిధులు వేణుగోపాల్‌కు అభినందనలు తెలిపారు.

అరటి పండ్లు, చికెన్ సరఫరాకు టెండర్లు

సీతంపేట: గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీగురుకులాలకు అరటి పండ్లు, చికెన్ సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమడి గురుకుల పాఠశాల, సీతంపేట, కారిగూడ మినీ గురుకులాలు, ఏకలవ్య మోడ్ స్కూల్స్‌కు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు సొమ్ము ఆయా సంస్థల పేరిట డీడీల రూపంలో టెండర్ షెడ్యూల్‌కు జతపర్చాలన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు రూ.500లు నగదు చెల్లించి టెండర్‌షెడ్యూల్‌ను గురుకులం సెల్‌కు అందజేయాలన్నారు. 26న ఐటీడీఏలో టెండర్ నిర్వహిస్తామని చెప్పారు. తక్కువ కోట్ చేసిన వారికి టెండర్లు ఖరారు చేస్తామన్నారు.

రబీకి రెడీ



వరి పంట

- సాధారణ సాగు విస్తీర్ణం: 67,676 హెక్టార్లు
- ఆరుతడి పంటల సాగుతో అధిక ఆదాయం

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్ ముగిసింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జూన్, ఆగస్టు నెలల్లో వర్షపాతం తక్కువగా నమోదైనా.. జూలై, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాలతో పంటలు ఆశాజనకంగా సాగయ్యాయి. ప్రధాన ఆహార పంట అయిన వరి 90 వేల హెక్టార్లలో సాగైంది. వరి పంట మరో 20 రోజుల్లో చేతికందనుంది. ప్రస్తుతం రైతులు రబీసాగుపై దృష్టిసారించారు. మొక్కజొన్న, అపరాలు, వేరుశనగ, చోడిపంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రబీ పంటల సాధారణ సాగువిస్తీర్ణం 67,676 హెక్టార్లు. ఇందులో వరి పంట సాధారణ విస్తీర్ణం 2,916 హెక్టార్లు, మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 21,398 హెక్టార్లు, చోడి 1,550 హెక్టార్లు, అపరాలు 30,578హెక్టార్లు.



మొక్కజొన్న పంట

ఆరుతడి పంటలపై దృష్టి

రబీలో వర్షాలు తక్కువగా కురుస్తాయి. నీటిలభ్యత తక్కువగా ఉంటుంది. అందుకే.. రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలపై ఆసక్తి చూపుతున్నారు. వరి పంటకు నీరు ఎక్కువగా ఉండాలి. అదే ఆరుతడి పంటలు అయితే నీటివసతి ఎక్కువ అవసరం ఉండదు. మెట్ట భూముల్లో పెసర, మొక్కజొన్న, ఉలవ, నువ్వు వంటి నీటి అవసరం లేని పంటల సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. రైతుల అవసరం మేరకు విత్తనాలు, ఎరువులను వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది.

రబీలో వివిధ రకాల పంటల సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

పంట పేరు	సాధారణ విస్తీర్ణం
వరి	2,916
జొన్న	05
మొక్కజొన్న	21,398
చోడి	1550
ఉలవలు	1682
మినుము	19,376
పెసర	11,202
కంది	248
చెరకు	5,281
వేరుశనగ	687
నువ్వులు	1566
మిరప	1767
ఉల్లి	38
టమోటా	272
ఇతర కూరగాయలు	1261

సాగుకు సమాయత్తం

ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్‌కు సన్నద్ధమవుతున్నాం. అన్ని పంటలు 67,676 హెక్టార్లలో సాగయ్యే అవకాశం ఉంది.

– వి.తారకరామారావు, వ్యవసాయశాఖ అధికారి

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు



వనంగుడిలో పుష్పాలంకరణలో కిరీటధారణలో దర్శనమిస్తున్న పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. విజయదశమిని పురస్కరించుకుని కొత్తవాహనాలను పైడితల్లి ఆలయం వద్ద ప్రారంభోత్సవం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పైడితల్లి ఆలయం వద్ద వాహన పూజలు

శాస్త్రోక్తంగా చండీయాగం

పైడితల్లి వనంగుడి ఆవరణలో వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా చండీయాగం జరిపారు. యాగవిశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

నూజివీడులో రసవత్తరంగా కబడ్డీ పోటీలు

- లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహణ
- నేడు ఫైనల్స్ మ్యాచ్‌లు

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో నిర్వహిస్తున్న 71వ మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సోమవారం సాయంత్రం ఏడు గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు, క్రీడల వల్ల పోటీతత్వం అలవడుతుందని, పేరుప్రతిష్టలు లభిస్తాయన్నారు. క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు.

సెమీస్‌కు చేరిన పురుషుల జట్లు

పురుషుల విభాగంలో కృష్ణా, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం జట్లు సెమీస్‌కు చేరాయి. లీగ్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జట్టు శ్రీకాకుళంపై 33–31, కృష్ణా జట్టు విజయనగరంపై 30–22, నెల్లూరు జట్టు పశ్చిమగోదావరిపై 24–17, కృష్ణా జట్టు గుంటూరుపై 37–22, శ్రీకాకుళం జట్టు పశ్చిమగోదావరిపై 41–13, విజయనగరం జట్టు గుంటూరుపై 29–14 తేడాతో గెలుపొందాయి.



పోటీలో తలపడుతున్న కృష్ణా-గుంటూరు జట్ల క్రీడాకారులు

మహిళల విభాగంలో..

శ్రీకాకుళం జట్టు విశాఖపట్నంపై 36–25, కృష్ణా జట్టు విజయనగరంపై 47–43 తేడాతో గెలుపొందాయి. మహిళల లీగ్ పోటీలు పొద్దుపోయే వరకు కొనసాగాయి. రిఫరీస్ బోర్డు కన్వీనర్ కే బాలు, రిఫరీలుగా ఎస్.మంగరాజు, ఎం.గణపతిరావు, బి.రామకృష్ణ, ఆర్.అప్పలస్వామి, కె.గోపిరాజు, బి.నాగేశ్వరరావు, పి.నరేంద్ర, వి.అనిల్, కె.జగదీష్ వ్యవహరించారు. కాగా ఫైనల్ మ్యాచ్‌లు బుధవారం జరగనున్నాయి. స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణ, సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, నబ్బినేని శ్రీనివాస్, దాసరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, సాహిత్యంలో పోటీలు

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు సాహిత్యంలో పోటీలు నిర్వహించనున్నట్టు మహరాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ వేదిక పేరుతో పద్యపఠనం, వ్యాసరచన, సాహితీ అంశాలపై సంస్కృత కళాశాలలో ఈ నెల 26వ తేదీన ఉదయం 9 గంటల నుంచి పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

- పాఠశాల జూనియర్ స్థాయి విభాగానికి 6, 7, 8 తరగతి విద్యార్థులు, సీనియర్ స్థాయి విభాగానికి 9, 10 తరగతి విద్యార్థులు, పద్యపఠన పోటీల్లో జూనియర్ స్థాయి కేటగిరీకి ఏవైనా మూడు నీతి శతక పద్యాలు భావయుక్తంగా, శ్రావ్యంగా చదవాల్సి ఉంటుంది. సీనియర్ స్థాయి విద్యార్థులు భాస్కర, దాశరథి, శ్రీకాళహస్తీశ్వర శతకాల నుంచి ఏవైనా మూడు పద్యాలు భావయుక్తంగా, శ్రావ్యంగా చదవాల్సి ఉంటుంది.

వ్యాసరచన పోటీలు...

పాఠశాల జూనియర్ స్థాయి విద్యార్థులకు తెలుగులో 'మన విజయనగరం జిల్లాలో పర్యాటక ప్రదేశాలు–వాటి ప్రాశస్త్యం', ఆంగ్లంలో 'ఇంపార్టెన్స్ ఆఫ్ టూరిజం ప్లేసెస్ ఆఫ్ విజయనగరం డిస్ట్రిక్ట్', సీనియర్ స్థాయి విద్యార్థులకు 'మన విజయనగరం సాహితీ వైభవం', ఆంగ్లంలో 'గ్లోరీ ఆఫ్ లిటరేజర్ ఆఫ్ విజయనగరం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు.

- ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగులో 'మన విజయనగరం జిల్లా చారిత్రక విశిష్టత', ఆంగ్లంలో 'హిస్టారికల్ ఇంపార్టెన్స్ ఆఫ్ అవర్ విజయనగరం డిస్ట్రిక్ట్', డిగ్రీస్థాయి విభాగంలో తెలుగులో 'మన విజయనగరం సాంస్కృతిక వైభవం', ఆంగ్లంలో 'కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ అవర్ విజయనగరం' అంశాలపై వ్యాసరచన పోటీలుంటాయి. బీఏ, బీకాం, బీఎస్సీ, డీఈడీ, ఇంజినీరింగ్, మెడిసిన్ ఇలా ఏ డిగ్రీ చదివే వారైనా డిగ్రీ స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు.
- ప్రతి పోటీకి విజయనగరం జిల్లాలోని ఒక్కో పాఠశాల, కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే అర్హులు. పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు/కళాశాల ప్రిన్సిపాల్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాల్సి ఉంది. ప్రతి అంశంలోనూ తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలు నిర్వహించి వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారు. పూర్తి వివరాల కోసం సాహిత్య వేదిక కన్వీనర్ డాక్టర్ జక్కు రామకృష్ణ (ఫోన్ 94414 27386)ను సంప్రదించాలి.

బలహీన వర్గాల్లో ఆర్థికోన్నతి

- పేదల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం
- 99 శాతం హామీలు అమలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అధిక మేలు
- 2024లో విజయమే లక్ష్యం: మంత్రి బొత్స
- చేసిన మంచిని వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర: పరీక్షిత్‌రాజు
- టీడీపీ విషప్రచారాన్ని తిప్పికొడదాం: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- బస్సుయాత్ర జయప్రదంపై పార్వతీపురంలో సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పార్వతీపురంటౌన్: బలహీనవర్గాల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, నాలుగున్నరేళ్లలో పేద కుటుంబాల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఉన్నారని, వారి వెనుకబాటును గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలతో ఆర్థికంగా అండగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వం వారిని ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడంతో పాటు అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే మేలు చేకూర్చారన్నారు. రాజకీయ, విద్య, వైద్యం, సామాజిక, ఆర్థికంగా ప్రత్యేక గుర్తింపు కల్పించారన్నారు. స్థానిక సంస్థలతో పాటు ఇతర రంగాల్లో 50–60 శాతం అణగారిన, బడుగు, బలహీన వర్గాలకే పెద్దపీట వేశారన్నారు. ఇంతటి మేలును వివరించేందుకే సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, దీనిని కలిసికట్టుగా జయప్రదం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఉందని, అనుకూల మీడియాను అడ్డు పెట్టుకొని టీడీపీ సాగిస్తున్న విషప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు.

- పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకురాలు శోభాహైమావతి మాట్లాడుతూ మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా నా వాళ్లు అని చెప్పుకునే మంచి మనసు సీఎం జగన్‌కే ఉందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు యాత్రతో ప్రజల్లోకి వెళ్తామన్నారు.
- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రశన్నకుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ తెచ్చిన సంక్షేమ పథకాలతో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ పారదర్శక పాలనతో సీఎం వైఎస్ జగన్ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మంచి చేస్తుంటే.. ఓర్వలేని తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రభుత్వంపై విషంచిమ్మే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. టీడీపీలా మనకు మీడియా లేకపోయినా ప్రజల మద్దతు ఉందని, వారికి చేసిన మేలును మరోసారి తెలిపేందుకే జనంలోకి వెళ్తున్నట్లు చెప్పారు. సమావేశంలో దాసరి, తూర్పుకాపు కార్పొరేషన్ల చైర్మన్లు రంగుముద్రి రమాదేవి, మామిడి శ్రీకాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మూడు మండలాల, పార్టీ పట్టణ అధ్యక్షులు, మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును వివరిద్దాం



ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు చేపట్టే సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేద్దాం. అట్టడుగున ఉన్న ఎంతో మంది ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు నామినెటెడ్ పదవులను పొందారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. మాటలతో చెప్పడం కాకుండా చేసి చూపిన ఘనత ఆయనదే. ఒకప్పుడు ప్రభుత్వ పథకాల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇప్పుడు అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయి. ప్రజలకు మంచి జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయం.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్



సమావేశానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చంద్రబాబును నమ్మొద్దు



బీసీలను ఓటు బ్యాంకుగా టీడీపీ అధినేత చంద్రబాబు వాడుకున్నారు. ఆయన, ఆ పార్టీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దు. జన్మభూమి కమిటీలు, గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీల పేరిట కేవలం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే మేలు చేశారు తప్పితే సామాన్య ప్రజలకు ఏ లబ్ధిచేకూర్చలేదు. అర్హతే ప్రామాణికంగా, నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల లబ్ధిని చేర్చుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అత్యధికంగా పదవులిచ్చి ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పార్వతీపురం నియోజకర్గ అభివృద్ధికి నాలుగున్నరేళ్ల కాలంలో రూ.1000 కోట్లు, సంక్షేమానికి రూ.600 వెచ్చించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.కోటిచొప్పున నిధులు మంజూరు చేశారు. సామాజిక బస్సు యాత్ర పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్తేజం నింపనుంది.

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే పార్వతీపురం

అన్నింటా ప్రాధాన్యం



బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్నింటా పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి... సామాజిక విప్లవం సృష్టించారు. దేశానికే ఆదర్శంగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు. చేసిన మేలును చెప్పేందుకు ఈ నెల 26 నుంచి నిర్వహించే సామాజిక న్యాయబస్సు యాత్రను సమష్టిగా విజయవంతం చేద్దాం. నవంబర్ 1న జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో ప్రారంభం కానుంది.

– శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైఎస్సార్‌సీపీ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ముగ్గురిపై దాడి కేసు నమోదు

వీరఘట్టం: ఈనెల 23న వీరఘట్టంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పండ్లు విక్రయిస్తున్న ఎస్.అచ్యుతరావుపై స్థానిక రెల్లివీధికి చెందిన దేవుపల్లి రఘు, దేవుపల్లి అశోక్, సిరిపురం శ్రావణ్‌లు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వి.రమణ మంగళవారం తెలిపారు. గాయపడిన అచ్యుతరావును చికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



కేజీహెచ్‌లో మృతి చెందిన రైతు సూరినాయుడు

లక్కవరపుకోట: పాము కాటుకు గురైన మండలంలోని జమ్మాదేవిపేట గ్రామానికి చెందిన రైతు బోజంకి సూరినాయుడు (74) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. సూరినాయుడు ఈ నెల 16న గ్రామ సమీపంలో వరిపంటకు నీరు పెడుతున్న సమయంలో పాము కాటువేసింది. దీంతో స్పృహకోల్పోయిన సూరినాయుడిని పక్క పొలాల్లో ఉన్న రైతులు గ్రామానికి తీసుకొచ్చి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య అప్పలకొండమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కొండబాబు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..



పోలినాయుడు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తారాపురం గ్రామానికి చెందిన బెవర పోలినాయుడు(49)పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీ కొట్టింది. దీంతో రోడ్డు దెబ్బతిన్న పోలినాయుడు అక్కడక్కడే దుర్మరణం చెందాడు. ఢీకొట్టిన బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోతుండగా గమనించి స్థానికులు ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లి బస్సును ఆపారు. తాను ఢీ కొనలేదని బస్సు డ్రైవర్ బుకాయిస్తుండగా పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సురేంద్రనాయుడు డ్రైవర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేయగా తానే ఢీ కొట్టినట్టు ఒప్పుకున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె మాధవి, కుమారుడు జగదీష్ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించారు.కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు ఉరి వేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

పార్వతీపురం టౌన్: పట్టణంలోని చాకలి బెలగాం శివారులో జంఝావతి కాలువ పక్కన బొడ్డచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామని ఎస్సై దినకర్ తెలిపారు. బెలగాం వీఆర్‌ఓ నారాయణపురం వెంకటరావు ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఉరివేసుకుని ఉన్న వ్యక్తి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. ఆకుపచ్చ టీ షర్టు, నీలిరంగు ఫ్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఈ వ్యక్తి సమాచారం తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మైనార్టీ కమిటీ సభ్యుల ఎంపిక

విజయనగరం టౌన్: ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన 15 సూత్రాల పథకాన్ని జిల్లాస్థాయిలో అమలుచేసే కమిటీలో సభ్యులుగా డాక్టర్ పి.ప్రేమానందం, మునిర్ మోహమ్మద్, షేక్ సలీంలను ఎంపికయ్యారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతులమీదుగా మంగళవారం నియామకపత్రాలను అందుకున్నారు. మైనార్టీ వర్గాల నుంచి తమకు అవకాశం కల్పించినందుకు వారంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎంపికతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, సమాజ సేవ చేసేందుకు అవకాశం వచ్చిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సత్యనారాయణరాజు, బిషప్ ఎం.పాల్సన్, రెవరెండ్ డి.ఎలీషా, జి.శ్రీధర్, థామస్ పాల్, బి.ఆనంద్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹230

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

- ఫోర్టిఫైడ్ రైస్‌తో సంపూర్ణ పోషణ
- జిల్లాలో 9,163 టన్నుల బియ్యం పంపిణీ



ఫోర్టిఫైడ్ బియ్యం



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం స్టాక్

విజయనగరం అర్బన్: ప్రజారోగ్యానికి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో పేద బడుగు వర్గాల ప్రజలకు పౌష్టికాహార లోపాన్ని నిరోధించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రైస్ కార్డు లబ్ధిదారులకు పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తోంది.

జిల్లాలో 5,81,214 బియ్యం కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా 9,163 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఫోర్టిఫైడ్ బియ్యం భుజించడం ద్వారా శరీరానికి సుక్ష్మపోషకాలు అందుతాయి. ప్రధానంగా పౌష్టికాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యం లోపం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్ బి 12తో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ బియ్యం కెర్నెల్స్ తయారు చేస్తారు. వీటిని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న బియ్యంలో కలుపుతారు. ఐసీడీఎస్, ప్రజాపంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ పథకాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

శరీరానికి అధికంగా సూక్ష్మపోషకాలు

ఫోర్టిఫైడ్ బియ్యం ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయి. ముఖ్యంగా ఇందులోని ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లల్లో మెదడు, వెన్నెముక పెరుగులకు తోడ్పడుతుంది. ఇక విటమిన్ బి12 మెదడు, నాడీ వ్యవస్థ అభివృద్ధికి, ఎర్ర రక్తకణాల ఉత్పత్తిలో కీలకంగా పనిచేస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని సరైన మోతాదులో ఉంచుతూ రక్తహీనతను అరికట్టడంలో ఐరన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

400 మైక్రో గ్రామ్స్ అవసరం

రోజూ తీసుకునే ఆహారంలో 400 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్ ఉండేలా చూసుకోవాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించిన ప్రమాణాలకు అనుగుణంగా మనం తీసుకునే 100 గ్రాముల అన్నంలో ఫోలిక్ యాసిడ్ 17 మైక్రోగ్రామ్స్ నుంచి 125 మైక్రోగ్రామ్స్ మధ్య ఉండాలి. అదే విధంగా ఐరన్ 28 నుంచి 42 మిల్లీగ్రాములు ఉండాలి. ఇక ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యం 100 గ్రాముల్లో 98 మైక్రోగ్రామ్స్ ఫోలిక్ యాసిడ్, ఐరన్ 40 మిల్లీగ్రాములు ఉంటుంది. ఇక విటమిన్ బి12 సమృద్ధిగా లభిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంత ఉపయోగకరమో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యంలో ఉండే పోషక విలువల గురించి వివరిస్తున్నాం. ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయనే విషయాన్ని బియ్యం పంపిణీ చేసే సమయంలో కార్డుదారులకు తెలియజేయాలని వలంటీర్లకు, ఎండీయూ వాహన నిర్వాహకులకు చెబుతున్నాం.

– మధుసూదనరావు, డీఎస్ఓ

పుష్కలంగా సూక్ష్మ పోషకాలు



ఫోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఫోలిక్ యాసిడ్ ఐరన్, విటమిన్ బి12 కలిగిన ఈ బియ్యంతో చేసిన పదార్థాలు బలవర్ధకమైన ఆహారం. ఈ బియ్యం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత దూరమవుతుంది. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రయోజనాలపై ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్

అభివృద్ధిని వివరించేందుకే సామాజిక బస్సుయాత్ర


- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అప్పలనరసయ్య



గొట్లాంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: గడిచిన నాలుగున్నరేళ్ల పదవీ కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను నేరుగా ప్రజల్లోకి తీసుకోని వెళ్లడానికే మంత్రుల సామాజిక బస్సు యాత్రను చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యాలయం ఇన్‌చార్జ్, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరయ్యలు పేర్కొన్నారు. ఈనెల 27న గజపతినగరం నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వారు పరిశీలించారు. ఈ మేరకు బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామంలో గల సచివాలయం ఆవరణలో మంత్రులు బస చేయనున్న ప్రాంతాన్ని, అలాగే అందుకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం గజపతినగరంలోని మెంటాడ రోడ్డులో నిర్వహించనున్న బస్సు యాత్ర బహిరంగ సభకు సంబంధించి సభా స్థలం ప్రాంతాన్ని పరిశీలించారు. సభకు సుమారు 20 వేల మంది వరకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన అన్ని ఏర్పాట్లతో పాటు, సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు స్పష్టం చేశారు. సామాజిక బస్సు యాత్రకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలు నాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, పీడిక రాజన్న దొర, మాజీ మంత్రి పేర్నినాని, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నట్లు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు.

28న రామతీర్థం దేవస్థానం మూసివేత



రామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని ఈ నెల 28న మూసివేస్తున్నట్లు దేవస్థాన ఈఓ కిషోర్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం ఆరోజు అర్ధ రాత్రి 1 గంట నుంచి 2.30 వరకు సంభవిస్తున్న కారణంగా 28న సాయంత్రం 5గంటలకు దేవస్థానంలో దర్శనాలు నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. వేకువ జామున స్వామి సన్నిధిలో సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం దేవాలయంలో దర్శనాలకు అనుమతిస్తామని భక్తులు గమనించాలని కోరారు.

నవంబర్ 3న నాస్ పరీక్షకు సన్నాహాలు



రామభద్రపురంలోని చింతల వీధి ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- 26,383 మంది విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- సన్నద్ధమవుతున్న విద్యాశాఖ

రామభద్రపురం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మరింత మెరుగుపడేలా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఈ మేరకు నిపుణులైన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తున్నాయి. అభ్యసన సామర్థ్యం, స్థాయి మెరుగుకు ఉపాధ్యాయులకు సైతం అవసరమైన శిక్షణ ఇచ్చి బోధనా పద్ధతుల్లో వినూత్న మార్పులు తీసుకువచ్చాయి. విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిన నేపథ్యంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం ఏ మేరకు మెరుగుపడిందో తెలుసుకునేందుకు జాతీయ స్థాయిలో నవంబరు 3న కేంద్ర ప్రభుత్వ అసెస్‌మెంట్ సర్వే(ఎన్ఏఎస్),రాష్ట్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్) పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 675 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న ర్యాండమ్‌గా గుర్తించిన 26,383 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు.

పకడ్బందీగా పరీక్ష నిర్వహణ

జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది. ఈ పరీక్షలు నిర్వహించేందుకు ఇన్విజిలేటర్లుగా డిగ్రీ, డీఎడ్,బీటెక్ ,పీజీ విద్యార్థులు 1151 మందిని విద్యాశాఖ నియమించింది. ఈ పరీక్షను పర్యవేక్షించేందుకు బ్లాక్ కో ఆర్డినేటర్లుగా ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించింది.

విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు



నాస్ పరీక్ష నిర్వహణ వల్ల విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. విద్యాబోధన, అభ్యసన విషయాల్లో మార్పుచేర్పులు జరిగాయి.విద్యార్థుల స్థాయి పెంపొందిచేలా బోధనలో వినూత్న పద్ధతులు, సాకేంతికత వచ్చాయి. ప్రస్తుతం విద్యార్థుల అభ్యసన సామర్థ్యం ఎలా ఉందో తెలుసుకోవడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష మంచి అవకాశం. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా రానున్న రోజుల్లో చేపట్టాల్సిన విద్యా విషయక చర్యలు, మార్పులపై స్పష్టత వస్తుంది.

– లింగేశ్వరరెడ్డి, డీఈవో, విజయనగరం

ఉత్సాహంగా వాక్ ఫర్ హెల్త్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



వాకింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: విజయనగరం ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లమ్మవారి జాతరమహోత్సవం, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు ఉల్లాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో 40 ఏళ్ల వయస్సు గల వారికి నిర్వహించిన వాకింగ్ పోటీల్లో వాకర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వాకర్స్‌కు సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబులు బహుమతులు ప్రదానం చేశారు. ఇదిలా ఉండగా ఉత్సవాల్లో భాగంగా 25న నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో గల ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు రామగోపాల్ తెలిపారు. ఆసక్తి గల వారు పోటీల్లో పాల్గొవచ్చని పేర్కొన్నారు.

ఫైనల్స్‌కు ముంబై, మహారాష్ట్ర



ముంబై జట్టు



మహారాష్ట్ర జట్టు

విజయనగరం: ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వేదికగా జరుగుతున్న అండర్–19 అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్ టోర్నీలో ముంబై, మహారాష్ట్ర జట్లు వరుస విజయాలతో దూసుకెళ్తున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన ఇరుజట్లు మంగళవారం జరిగిన సెమీస్‌లో దూకుడు కనబరిచి బరోడా, తమిళనాడు జట్లను మట్టి కరిపించాయి. ఈనెల 26న డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరగనున్న ఫైనల్స్ మ్యాచ్‌లో ముంబై, మహారాష్ట్ర జట్లు తలపడనున్నాయి.

సిరులు కురిపిస్తున్న పూలు

- బంతి, చామంతి, గులాబీలకు డిమాండ్



నెల్లిమర్ల మండలం నారాయణపురంలో సాగులో ఉన్న గులాబీ తోట



మొయిదలో బంతి తోట

విజయనగరం ఫోర్ట్: పూలు సాగు చేసే రైతులు నాలుగు రాళ్లు వెనుకేసుకుంటున్నారు. అన్ని రకాల పూలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో పూలసాగు సిరులు కురిపిస్తోంది. సాగు లాభదాయకంగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా అనేక మంది రైతులు ఆ బాట పట్టారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకం సాగు చేస్తుండగా కొన్ని ప్రాంతాల్లో అన్ని రకాల పూలను సాగు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన తోటల వద్దకే వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసుకుంటున్నారు. మరి కొంతమంది రైతులు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అయ్యప్ప మాల ధారణ ప్రారంభం కావడంతో పూల వినియోగం పెరిగింది.

40 వేల హెక్టార్లలో పూల సాగు

జిల్లాలో 40 వేల హెక్టార్లలో పూలు సాగవుతున్నాయి. 20 వేల హెక్టార్లలో బంతి, 10 వేల హెక్టార్లలో గులాబీ, చామంతి 5 వేలు హెక్టార్లు, మల్లె, కనకంబరాలు 5 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

గణనీయంగా పూల వినియోగం

గతంలో పూల వినియోగం తక్కువగా ఉండేది. ప్రస్తుత కాలంలో గణనీయంగా పెరిగింది. శుభ కార్యాలు, బర్త్‌డే, ఇతర ఫంక్షన్లకు గతంలో ప్లాస్టిక్ ఫ్లవర్స్‌తో డెకరేషన్ చేసేవారు. ప్రస్తుతం శుభకార్యాలలకు బంతి, చామంతి. గులాబీలను వినియోగిస్తున్నారు.

కార్తీక మాసంలో బంతిపూలకు డిమాండ్

కార్తీక మాసంలో అయ్యప్ప మాల ధరించే స్వాములు ఎక్కువగా ఉండడంతో దీంతో బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. అయ్యప్ప స్వాములు అంబలం పూజలు, ఇడుముడి కట్టేటప్పుడు ఎక్కువగా బంతి పూల వినియోగం ఉంటుంది. బంతి, గులాబీలతో కూడిన దండలు, బంతి, చామంతిపూలతో కూడిన దండలకు డిమాండ్ ఉంది.

అధికంగానే పూలసాగు

జిల్లాలోని అన్ని మండలాల్లో పూలు సాగు చేస్తున్నారు. నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, రామభద్రపురం తదితర మండలాల్లో ఎక్కువగా పూల సాగు ఉంది. బంతి, చామంతి, గులాబీ పూలకు మార్కెట్‌లో మంచి ధర లభిస్తోంది.

– జమదగ్ని, ఉద్యానశాఖ డీడీ

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో ఐటీఐ కళాశాల వద్ద బైక్ అదుపుతప్పి కుశిమి గ్రామానికి చెందిన కె.దిలీప్ అలియాస్ చంటి (25) సోమవారం మృతి చెందారు. కొత్తూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొట్టి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కొనఊపిరితో ఉన్న యువకుడిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం



సంతకవిటి: నదీ తీరంలో అవినాష్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

సంతకవిటి: మండల పరిధి తమరాం వద్ద ఆదివారం నాగావళి నదిలో స్నానానికి దిగి గల్లంతైన విద్యార్థి గంటా అవినాష్(21) మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైందని ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని రాజాంలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించి పోస్ట్ మార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించినట్లు వెల్లడించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



బాడంగి: ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు

బాడంగి: మద్యానికి బానిసై తరచూ కుటుంబంలో తగాదాలతో విరక్తి చెందిన వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆలస్యంగా తెలిసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని డొంకినవలసకు చెందిన అంబటి శ్రీనివాస రావు (44) శనివారం పురుగు మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పతికి తీసుకువెళ్లగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు హెచ్‌సీ డి.సన్యాశిరావు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ట్యాంకర్ ఢీకొని ఇద్దరి మృతి

- ఒకరికి గాయాలు



సంఘటనా స్థలంలో రవికుమార్ మృతదేహం



రవికుమార్ (ఫైల్)

గరుగుబిల్లి: మండలంలోని ఖడ్గవలస–నాగూరు ప్రధాన రహదారి పరిధిలో ఎర్రన్నగుడి జంక్షన్ నుంచి నాగూరువైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురిని వీరఘట్టంనుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో సోమవారం జరిగిన ప్రమాదంలో సంఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మహిళ మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎస్సై ఎం. రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలంలోని గొట్టివలసకు చెందిన బోను రవికుమార్, అడ్డాపుశీలకు చెందిన గడదేశి గౌరమ్మ (42), కొత్తూరు గ్రామానికి చెందిన కొప్పర గౌరీశంకరరావులు బైక్‌పై ప్రయాణిస్తుండగా ట్యాంకర్ ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి వారు ముగ్గురూ రోడ్డుమీదకి తుళ్లిపడ్డారు. ఆ సమయంలో రవికుమార్ తలపై నుంచి ట్యాంకర్ టైర్లు వెళ్లడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. గౌరమ్మ అపస్మారక స్థితికి చేరుకోవడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది, బైక్ నడుపుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన కొప్పర గౌరీశంకరరావుకు గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రవికుమార్‌కు భార్య రాధతో పాటు తల్లి అక్కమ్మ, కుమారుడు శశేఖర్, కుమార్తె ద్రాక్షాయిని ఉన్నారు. గౌరమ్మ తన అన్న గడిదేశి గంగులు ఇంటి వద్ద నివసిస్తోంది. మృతుడు రవికుమార్ భార్య రాధ ఫిర్యాదుమేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పండగ పూట విషాదం నెలకొనడంతో గొట్టివలస, అడ్డాపుశీల గ్రామాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్సైతో చర్చించారు.